
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
సోమవారం 7 జూలై 2025



దట్టీలు కట్టి.. దండాలు పెట్టి



ఆమనగల్లులో పీర్ల ఊరేగింపు

జిల్లావ్యాప్తంగా మొహర్రం వేడుకలను ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. త్యాగానికి ప్రతీకగా జరుపుకునే ఈ వేడుకలను పురస్కరించుకొని చావిడిలలోని పీర్లను భక్తులు దర్శించుకొని ఊదు, బెల్లం సమర్పించారు. అనంతరం దట్టీలు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. చావిడి వద్ద జరిగిన పూజల్లో నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం పట్టణాలు, గ్రామాల్లో పీర్లతో భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలు షర్బత్ పంపిణీ చేశారు.
- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్



షాద్‌నగర్ అర్బన్ : చేగిరెడ్డిఘనాపూర్‌లో..



మొయినాబాద్ రూరల్ : చిలుకూరు ఆలయంలో భక్తులు



ఆమనగల్లు : వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు

తొలిఏకాదశి వేడుకలను జిల్లావ్యాప్తంగా ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ నేపథ్యంలో ఆలయాలను పచ్చటి తోరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులతో ప్రధాన ఆలయాలు సందడిగా మారాయి. మహిళలు ఉపవాస దీక్షలు చేపట్టి సాయంత్రం ఆలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు. చిలుకూరు బాలాజీ ఆలయం భక్తులతో పోటెత్తింది. అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.
- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్



మాట్లాడుతున్న ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి

ఫార్మా భూ నిర్వాసితులకు నేడు ప్లాట్ల కేటాయింపు

మొదటి రోజు 60గజాల ఇంటి స్థలాల అందజేతకు లాటరీ

కందుకూరు/యాచారం, జూలై6 (ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీ కోసం భూములు ఇచ్చిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం నేటి (సోమవారం) నుంచి ఇంటి స్థలాలను లాటరీ ప్రక్రియ ద్వారా కేటాయించాలని నిర్ణయించిందని ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మీర్కాన్‌పేటలో రెవెన్యూ సిబ్బందికి నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కందుకూరు మండలంలోని మీర్కాన్‌పేట, ముచ్చర్ల, పంజగూడ, తిమ్మాయిపల్లి రెవెన్యూ గ్రామాలతో పాటు యాచారం మండలం కుర్మిద్ద, మేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, రెవెన్యూ గ్రామాలకు సంబంధించిన భూములను హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం గతంలో భూములను సేకరించినట్లు తెలిపారు. భూములు కోల్పోయిన రైతుల అంగీకారం మేరకు ఎకరానికి 121గజాల ఇంటి స్థలాన్ని ఇవ్వడానికి మీర్కాన్‌పేట, పంజగూడ, తిమ్మాయిపల్లి రెవెన్యూలలో హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో వెంచర్‌ను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. రైతులకు ఈ వెంచర్‌లోని ప్లాట్ల పూర్తి హక్కులు కల్పిస్తూ ప్రభుత్వం ఈనెల 7 నుంచి 10వ తేదీ వరకు మండలంలోని బేగరికంచ గ్రామ పంచాయతీ పరిధిలోని ఏటీసీ కేంద్రంలో లాటరీ తీయనున్నట్లు తెలిపారు. సోమవారం 60 గజాల స్థలానికి సంబంధించిన లాటరీని తీయనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకుగాను రైతులకు గతంలో జారీ చేసిన ప్లాట్ పట్టా, ఆధార్ కార్డు జిరాక్స్ పాన్‌కార్డు(లేనిచో ఫారం-60), ఫారం 32ఏ, రెండు పాస్ ఫొటోలు తీసుకురావాలన్నారు. మంగళవారం 121 గజాల ఇంటి స్థలానికి సంబంధించి, బుధవారం 181 గజాల ఇంటి స్థలం, గురువారం ఐదు ఎకరాల వరకు భూములు ఇచ్చిన రైతులకు ప్లాట్లను కేటాయించడానికి లాటరీని తీయనున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి రోజు ఉదయం 9గంటల నుంచి ఈ ప్రక్రియ ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్లు కె.గోపాల, అయ్యప్ప పాల్గొన్నారు.

ఫాం-32 కింద దరఖాస్తుల స్వీకరణ

ఫార్మాసిటీ కోసం భూములు ఇచ్చిన యాచారం మండలంలోని కుర్మిద్ద, తాటిపర్తి, నానక్‌నగర్, మేడిపల్లి గ్రామాలకు చెందిన రైతుల నుంచి నేడు ఫాం 32 కింద దరఖాస్తులు తీసుకొని డ్రా పద్ధతిన ప్లాట్లు కేటాయిస్తామని ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంత రెడ్డి, తహసీల్దారు అయ్యప్ప చెప్పారు. మేడిపల్లిలో 255మంది. కుర్మిద్దలో 131 మంది, తాటిపర్తి 65మంది, నానక్‌నగర్‌లో 91 మంది రైతుల నుంచి ఫాం 32 కింద దరఖాస్తు తీసుకుంటామని వారు వెల్లడించారు.

'ఇందిరమ్మ' బిల్లు ఇంకా రాలే!

అందని ఇంటి నిర్మాణ సాయం

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు మూడు అడుగులు ముందుకు... ఆరు అడుగులు వెనక్కు అన్నట్లు సాగుతున్నాయి. ఇంటి నిర్మాణం బేస్మెంట్, పిల్లర్ల వరకు జరిగినా మొదటి విడత బిల్లు అందక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. అప్పులు చేసి ఇంటి పనులు ప్రారంభిస్తే బిల్లులు సకాలంలో అందడం లేదని ఆవేదన చెందుతున్నారు. అప్పులు చేసి ఇల్లు కట్టడం మొదలెడితే పేమెంట్ రాక వడ్డీలు పెరిగి పోతున్నాయని వాపోతున్నారు. కొందరైతే ఇల్లు మంజూరైనా చేతిలో డబ్బులు లేక నిర్మాణ పనులు చేపట్టలేకపోతున్నారు. మరికొందరు ప్రస్తుతం ఇంటి నిర్మాణ సామగ్రి ధరలకు బెంబేలె

మొదటి విడత డబ్బుల కోసం ఎదురుచూపు

- బేస్మెంట్, పిల్లర్ల వరకు పనులు పూర్తి
- ఆర్థిక ఇబ్బందుల్లో లబ్ధిదారులు
- అంచనాలకు మించి నిర్మాణ ఖర్చులు
- సూక్ష్మరుణాలు ఇవ్వని బ్యాంకర్లు



శంకర్‌పల్లిలో నిర్మాణంలో ఉన్న ఇల్లు

ఇందిరమ్మ ఇళ్ల వివరాలు

కేటాయించిన ఇళ్లు 17,440	బేస్‌మెంట్ లెవల్ 919
బేస్‌మెంట్ కంప్లీట్ 1,675	రూఫ్ లెవల్ 81
స్లాబ్ లెవల్ 35	గ్రౌండింగ్ దశలో 10,727
పేమెంట్ పూర్తయినవి 300	నాన్‌స్టార్టెడ్ 6,713


రంగారెడ్డి అర్బన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి బిల్లుల కోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. ఇల్లు మంజూరైనప్పటికీ, బిల్లులు విడుదల చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. చాలామంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం ప్రారంభించినప్పటికీ బిల్లులు సకాలంలో రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పైలెట్ గ్రామాల్లో వెంటనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేయడంతో రేకుల ఇళ్లు, గుడిసెలు, పెంకుటిళ్లు తొలగించారు. వాటి స్థానంలో ముగ్గు పోసుకుని కొత్త ఇంటి నిర్మాణాలను ప్రారంభించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతీ ఇంటి

మిగతా 8వ పేజీలో...

రాష్ట్రంలో టాప్..

జిల్లాకు 17,440 ఇళ్లు మంజూరు చేయగా, అందులో 919 బేస్‌మెంట్ లెవల్, బేస్‌మెంట్ పూర్తి చేసుకున్నవి 1,675 ఇళ్లు ఉన్నాయి. రూఫ్ లెవల్ 81, స్లాబ్ లెవల్ వరకు 35 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. 10,727 ఇళ్ల నిర్మాణాలు గ్రౌండింగ్ దశలో ఉన్నాయి. ఇతర జిల్లాలతో పోలిస్తే నిర్మాణాల్లో రంగారెడ్డి జిల్లా ముందు వరుసలో ఉంది. ఇప్పటి వరకు 300 ఇళ్లకు పేమెంట్ జరిగింది.

ప్రతీ సోమవారం పేమెంట్ చేస్తున్నాం



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ప్రతీ సోమవారం పేమెంట్ చేస్తున్నాం. మూడు వందలకు పైగానే ఇళ్లకు బిల్లులు ఇవ్వడం జరిగింది. బ్యాంకు ఐఎఫ్ఎస్ కోడ్ తప్పుగా ఇవ్వడం వల్ల బిల్లులు ఆగుతున్నాయి. టెక్నికల్ సమస్య ఉంటే తప్ప పేమెంట్‌కు ఎలాంటి సమస్య లేదు. లబ్ధిదారులు త్వరగా ఇంటి నిర్మాణం చేసుకోవాలి. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో రాష్ట్రంలోనే నెంబర్ వన్‌లోనే ఉన్నాయి. అందుబాటులో ఇసుక దొరికితే తెచ్చుకునేందుకు లబ్ధిదారులకు కూపన్లు ఇచ్చాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొలతలు ఉంటేనే పేమెంట్ జరుగుతుంది. ఇప్పటి వరకు ప్రారంభించని ఇళ్ల జాబితాను తయారు చేస్తున్నారు. కట్టుకునేందుకు ఆసక్తి లేదని రాసి ఇస్తే.. మరో లబ్ధిదారుడికి ఇల్లును కేటాయించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇల్లు ప్రారంభించేందుకు మరో అవకాశం ఇస్తున్నాం.

డి.చంప్లా నాయక్, జిల్లా హౌజింగ్‌శాఖ అధికారి

ధరాఘాతం

పెరిగిన ఇంటి నిర్మాణ సామగ్రి రేట్లు

ఇబ్రహీంపట్నం : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మెటీరియల్, కూలీ రేట్లు శరాఘాతంగా మారాయి. ప్రభుత్వమిచ్చే రూ.5లక్షల సాయం ఏమాత్రం సరిపోవడంలేదు. దీనికి తోడు మరో రూ.5 లక్షలు అదనంగా ఖర్చు చేయనిదే ఇంటి నిర్మాణం పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేదు. ఇటుక, ఇసుక, కంకర, డస్ట్, ఇలా అన్నింటి ధరలు పెరిగాయి. మేస్త్రీ, లేబర్ చార్జీలు కూడా పెంచేశారు. స్టీలు, సిమెంట్ ధరలు మాత్రం నిలకడగా ఉన్నాయి. మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం మొదలు కాకముందు ధరలకు

మిగతా 8వ పేజీలో...



మొయినాబాద్‌లోని నర్సరీలో మొక్కలు

వన మహోత్సవానికి వేళాయే..

నేడు 11వ విడతకు శ్రీకారం చుట్టనున్న సీఎం

- వ్యవసాయ యూనివర్సిటీలో ఏర్పాట్లు పూర్తి
- శాఖల వారీగా టార్గెట్లు ఖరారు
- జిల్లాలో 78.54 లక్షల మొక్కలు నాటడం లక్ష్యం

రంగారెడ్డి అర్బన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వన మహోత్సవ కార్యక్రమానికి అధికారులు సర్వం సిద్ధం చేశారు. 11వ విడత కార్యక్రమాన్ని నేడు(సోమవారం) వ్యవసాయ యూనివర్సిటీలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సీఎం మొక్కలు నాటిన తర్వాత అన్ని జిల్లాల్లో మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభిస్తారు. ఇప్పటికే గ్రామాల్లోని

మిగతా 8వ పేజీలో...

ఆదర్శప్రాయుడు బాబూ జగ్జీవన్‌రామ్

చేవెళ్ల, జూలై 6(ఆంధ్రజ్యోతి) : బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్ అని, ఆయనను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకొని చేవెళ్లలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకొని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి చేవెళ్లలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్. రత్నం, కంజర్ల ప్రకాష్, అనంతరెడ్డి, వైభవ్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, శ్రీనివాస్‌గుప్తా, చేవెళ్ల సొసైటీ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, యాదయ్య, రాములు, పాండు, సత్యనారాయణరెడ్డి, మాణిక్యం, దుర్గాప్రసాద్, నర్సింహులు, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.



జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రత్నం

మహిళలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

షాద్‌నగర్ అర్బన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పేద మహిళలకు నెలకు రూ.2,500 భృతిని ఇస్తామని ఆశచూపిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలో వచ్చిన తర్వాత మాట తప్పిందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య ఆరోపించారు. షాద్‌నగర్ పెన్షనర్ భవనంలో రెండు రోజుల పాటు నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా 9వ మహాసభలు ఆదివారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. వ్యవసాయ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేసి, వారి హక్కులను సాధించాలని పిలుపునిచ్చారు. టీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు అంజయ్య అధ్యక్షతన జరిగిన సభలో ప్రవేశపెట్టిన తీర్మానాలను ఆమోదించారు. ఈ సందర్భంగా టీకేఎంయూ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జె. అంజయ్య, ప్రధాన కార్యదర్శిగా బుద్దుల జంగయ్య, కార్య నిర్వాహక అధ్యక్షుడిగా శివాల లక్ష్మయ్య, ఉపాధ్యక్షులుగా పాలమాకుల జంగయ్య, శ్రీశైలం యాదవ్, జిల్లెల్ల వెంకటేష్, సహాయ కార్యదర్శులుగా రమేష్‌యాదవ్, స్వరూప, కోశాధికారిగా ఎం.కృష్ణను ఎన్నుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలకొండ కాంతయ్య

రేబిస్ వ్యాధిపై అవగాహన అవసరం

జిల్లా పశువైద్యాధికారి మధుసూదన్

రంగారెడ్డి అర్బన్, 6 (ఆంధ్రజ్యోతి) : రేబిస్ వ్యాధిపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ మధుసూదన్ అన్నారు. ఆదివారం ప్రపంచ జునోసిస్ డే సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉచిత రేబిస్ వ్యాక్సినేషన్ నిర్వహించారు. సరూర్‌నగర్‌లోని పశువైద్య ప్రాథమిక చికిత్స కేంద్రంలో నిర్వహించిన శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కుక్కలు, పిల్లులకు ఉచితంగా టీకాలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు వ్యాపించే వ్యాధుల్లో జునోసిస్ ఒకటని, ప్రధానంగా రేబిస్ అత్యంత ప్రాణాంతకమైనదన్నారు. ప్రతీ సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా వేలాది మరణాలు ఈ వ్యాధి వల్లనే సంభవిస్తున్నాయని, దీనిని టీకా ద్వారా పూర్తిగా నివారించవచ్చన్నారు. అయితే సమర్థవంతమైన టీకాల వినియోగం లేకపోవడం వల్ల ఇది సమస్యగా మారుతుందని చెప్పారు. ప్రతీ ఇంట్లోని పెంపుడు కుక్కలు, పిల్లులకు ఏడాదికోసారి రేబిస్ టీకా వేయించాలన్నారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్యులు డాక్టర్ టి. శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ లలిత, డాక్టర్ గిరీష్ దేశ్‌ముఖ్, డాక్టర్ డి.యాదగిరి, పృథ్వీరాజ్, వెటర్నరీ అసిస్టెంట్, రతన్, షఫీ, పద్మ, భీమ్ తదితరులు పాల్గొన్నారు.



కుక్కకు వ్యాక్సిన్ వేస్తున్న మధుసూదన్

బోటింగ్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి

వికారాబాద్: సర్పన్‌పల్లి ప్రాజెక్టులో అక్రమంగా నిర్వహిస్తున్న బోటింగ్ కేంద్రాలను సీజ్ చేయాలని, నిర్వాహకులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి వై.గీత డిమాండ్ చేశారు. ఇద్దరు మహిళలు చనిపోయిన సంఘటనకు అధికారుల నిర్లక్ష్యమే కారణం అన్నారు. బోటింగ్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలన్నారు. రాజకీయ నాయకులు, అధికారుల అండతో ప్రాజెక్టులన్నీ బోటింగ్ కేంద్రాలుగా మారుతున్నాయని ఆరోపించారు. సర్పన్‌పల్లి ప్రాజెక్టు పరిసరాల్లోని అక్రమ రిసార్టులన్నింటినీ సీజ్ చేయాలనిడిమాండ్ చేశారు.

సీసీఐలో కార్మికుడికి గాయాలు

తాండూరు రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కరన్‌కోట్ గ్రామ శివారులోని కేంద్ర ప్రభుత్వ రంగ సీసీఐ కర్మాగారంలో ఓ కాంట్రాక్ట్ కార్మికుడి చేతికి ప్రమాదవశాత్తు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం రాత్రి తాండూరు మండలం కరన్‌కోట్ సీసీఐ(సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)లో జరిగింది. కరన్‌కోట్ గ్రామానికి చెందిన కట్ట రాంచందర్ కరన్‌కోట్ సీసీఐ కర్మాగారంలోని లైమ్ స్టోన్ క్రషర్ విభాగంలో క్లీనింగ్ లేబర్‌గా పనిచేసున్నాడు. స్టోన్ క్రషర్‌లో శనివారం రాత్రి పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు ఎడమ చెయ్యి క్రషర్ బెల్ట్‌కు తగిలి ఇరుక్కుపోయింది. తోటి కార్మికులు గమనించి క్రషర్ బెల్టును ఆపి రాంచందర్ చేతులను బయటికి తీశారు. అప్పటికే ఆయన చెయ్యి నుజ్జునుజ్జయింది. వెంటనే యాజమాన్యం కర్ణాటక రాష్ట్రం గుల్బర్గలో ఉన్న ఈఎస్ఐ ఆస్పత్రికి అర్ధరాత్రి తరలించారు. అక్కడి వైద్యులు ఆదివారం హైదరాబాద్ ఈఎస్ఐ ఆసుపత్రికి తరలించారు.











రియల్టర్ కబ్జాలో అటవీ భూమి?

ధారూరు, జూలై6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లాపూర్ శివారు పొతుల వాగు వద్ద భూమిని కొనుగోలు చేసిన రియల్టర్ చుట్టు పక్కల ఉన్న అటవీభూమిని అక్రమించుకున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. గతంలో అటవీశాఖ అధీనంలో ఉన్న ప్రాంతం రియల్టర్ ఆధీనంలో ఉన్నట్లు వారు చెబుతున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన అటవీశాఖ అధికారులు అటవీ హద్దురాళ్ల పాతడంలో అవకతవకలకు పాల్పడటంతో అటవీభూమి అన్యాక్రాంతమైందని రైతులు అంటున్నారు. కాగా అల్లాపూర్ శివారులో కొంతమంది రైతుల భూములను నల్గొండ ప్రాంతానికి చెందిన ఓ రియల్టర్ 41ఎకరాలు కొనుగోలు చేశాడు. రెవెన్యూ రికార్డు ప్రకారం పట్టాదారుల వద్ద భూములను కొనుగోలు చేసిన రియల్టర్ అంతకన్నా ఎక్కువ భూమిని అక్రమించుకున్నట్లు చుట్టుపక్కల రైతులు ఆరోపిస్తున్నారు. ఇరిగేషన్ పరిధిలోని వాగుతో పాటు అటవీ ఆధీనంలో ఉన్న కోట్‌పల్లి ప్రాజెక్టు కెనాల్‌ను రియల్టర్ ధ్వంసం చేసి ఆక్రమించినట్లు నీటిపారుదల శాఖ అధికారుల విచారణలో గుర్తించారు. రియల్టర్ కొనుగోలు చేసిన భూమిపక్కనే అల్లాపూర్ అటవీ బ్లాక్‌లో సర్వే నంబరు 11లో 107 ఎకరాలు, 110 సర్వే నంబరులో 41.15ఎకరాలు, 234లో 489.3 ఎకరాలు, సర్వేనంబరు 230లో 217.34 ఎకరాలు అటవీభూమి ఉన్నట్లు అటవీ అధికారులు చెబుతున్నారు. కాగా ఈ అటవీభూమికి అనుకుని ఉన్న భూమిని రియల్టర్ కొనుగోలు చేసి చదును చేశాడు. రియల్టర్ కొనుగోలు చేసిన భూమిలో అటవీ భూమి ఉందని చుట్టు పక్కల రైతులు చెబుతున్నారు. కాగా గతంలో ఇక్కడ పనిచేసిన అటవీ అధికారులు ఫారెస్టు మ్యాపు ప్రకారం హద్దురాళ్లు పాతకుండ అవకతవకలకు పాల్పడటంతో ఫారెస్టు భూమి ఆక్రమణకు గురైందని వారు అంటున్నారు. రెవెన్యూ, ఫారెస్టు అధికారులు జాయింట్ సర్వే నిర్వహిస్తే రియల్టర్ ఆక్రమించుకున్న అటవీ భూమి లెక్క తేలుతుందని వారు అభిప్రాయపడుతున్నారు.


అక్రమణలో ఉన్న అటవీ భూమి

జాయింట్ సర్వేకు డీఎఫ్‌వోకు నివేదించాం



సర్వే నంబరు 11లో రెవెన్యూ, అటవీశాఖ జాయింట్ సర్వే కోసం డీఎఫ్‌వోకు నివేదించాం. సర్వే చేస్తేనే రియల్టర్ ఆక్రమించిన అటవీ భూమి లెక్క తేలుతుంది. ఈ సర్వే నంబరులో 107ఎకరాల అటవీ భూమితో పాటు, 22 ఎకరాలు రెవెన్యూ భూమి ఉంది. గతంలో పాతిన హద్దుల ప్రకారం కందకాల చుట్టూ రియల్టర్ కొంత ప్రాంతాన్ని చెరిపినట్లు గుర్తించి నోటీసులు జారీ చేస్తున్నాం. జాయింట్ సర్వేలో అటవీ భూమి కబ్జాకు గురైనట్లు తేలితే విడిపించేందుకు చర్యలు తీసుకుంటాం.


- రాజేందర్, ధారూరు ఫారెస్టు రేంజర్

ఘనంగా వేంకటేశ్వరుడి కల్యాణం

పరిగి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పరిగిలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏకాదశి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం 6 గంటలకు స్వామివారికి పంచామృత అభిషేకం, అలంకరణ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి దంపతులు నిర్వహించారు. పరిగి పట్టణ ప్రజలతో పాటు వివిధ గ్రామాల నుంచి భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవాల్లో సిద్ధాంతి పార్థసారధి, మార్కెట్ చైర్మన్ పరశురాంరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధానకార్యదర్శి కె.హన్మంత్ ఎ.కృష్ణ, శ్రీనివాస్, సత్యనారాయణ, గోపాల్ పాల్గొన్నారు.


స్వామివారి కల్యాణంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దంపతులు






సీఐకి ఫిర్యాదు చేస్తున్న నాయకులు

అంబేడ్కర్ విగ్రహం ధ్వంసంపై ఫిర్యాదు

వికారాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్‌లోని రైల్వేస్టేషన్ ఎదుటగల అంబేడ్కర్ విగ్రహాన్ని గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేశారు. విగ్రహం కుడిచేతిని అర్ధరాత్రి సమయంలో విరగొట్టారు. విషయం తెలుసుకున్న పార్టీల నాయకులు, ప్రజాసంఘాలు, అంబేడ్కర్ వాదులు ఘటనాస్థలానికి చేరుకుని విగ్రహాన్ని పరిశీలించారు. అనంతరం నిరసన వ్యక్తం చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిని వెంటనే గుర్తించాలన్నారు. వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్, సుధాకర్‌రెడ్డి, ఆనంద్, సత్యనారాయణ, కొత్తగడి రమేష్, తదితరులు పాల్గొన్నారు. అంబేడ్కర్ విగ్రహంపై దాడిని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గోపాల్ ఖండించారు.

ఘటనపై స్పీకర్ ఆరా

రైల్వే స్టేషన్ సమీపంలో అంబేడ్కర్ విగ్రహ ధ్వంసం సంఘటనపై తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆరా తీశారు. ఆదివారం ఎస్పీ నారాయణరెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. అంబేద్కర్ విగ్రహానికి తక్షణమే మరమ్మతులు చేసి యధాస్థితికి తీసుకురావాలని సూచించారు. అలాగే అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం తెలుసుకుని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అక్కడికి వెళ్లి పరిశీలించారు.


ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులతో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

కేంద్ర పథకాల పేరు మారుస్తున్న రాష్ట్రం

● చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

తాండూరు రూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలనే రాష్ట్రప్రభుత్వం పేరుమార్చిఅమలు చేస్తోందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం తాండూరులోని బసవేశ్వరనగర్‌లో ఎంపీ ల్యాడ్స్‌తో చేపట్టిన సీసీ రోడ్డు పనులను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉప్పరి రమేష్‌కుమార్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర పథకాలను ఇందిరమ్మ సౌరగిరి(సోలార్)తెలంగాణ, ఇందిరమ్మ క్యాంటీన్ల పేరిట అమలు చేస్తోందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 200 గ్రామాల్లో రూ.12కోట్లతో సీసీరోడ్లు వేశామని తెలిపారు. 150 పాఠశాలల్లో తమ ఫౌండేషన్ ద్వారా మరుగుదొడ్లను శుభ్రం చేయిస్తున్నట్టు చెప్పారు. జిల్లాఅధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, లలిత, శ్రీలత, మల్లేశం, శాంత్ కుమార్, సాయిరెడ్డి, ఆంజనేయులు, భద్రేశ్వర్, కృష్ణ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతాం

వికారాబాద్/దోమ: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ సత్తా చాటుతామని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. వికారాబాద్‌లోని ఎన్కెపల్లి సమీపంలో ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. సదానందరెడ్డి,రమేష్‌కుమార్, ఈశ్వరప్ప, పెద్దింటినవీన్, వడ్ల నందు, శంకరస్వామి, యాదగిరి శంకర్, కార్తీక్, మోహన్‌రెడ్డి, ఆశిరెడి పాల్గొన్నారు. అలాగే దోమ మండల కేంద్రంలో బీజేపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేఎస్ఆర్ ట్రస్టు చైర్మన్ శరత్‌కుమార్‌రెడ్డిని బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కరణం ప్రహ్లాద్‌రావు, వెన్న ఈశ్వరప్ప, గణపూరం వెంకటయ్యగౌడ్, మిట్ట పరమేశ్వర్‌రెడ్డి, రమేశ్, యాదయ్య, పాల్గొన్నారు.

ప్రస్తుత ప్రభుత్వం దరిద్రంగా మారింది

గత బీఆర్ఎస్ ప్రభుత్వం కంటే ప్రస్తుతం ప్రభుత్వం దరిద్రంగా మారిందని, దేవాలయాలపై తరుచూ దాడులు జరుగుతున్నాయని ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఐటీఐ కళాశాల హనుమాన్ దేవాలయాన్ని సందర్శించి మాట్లాడారు. ఇప్పటి వరకు 20, 30 ప్రాంత్రాల్లో ఇలాంటి సంఘటనలు జరిగాయన్నారు. గత ప్రభుత్వం కంటే ఈ ప్రభుత్వం దరిద్రంగా మారి హిందూ దేవుళ్ల వెంట పడుతున్నారన్నారు. హనుమాన్ విగ్రహాన్ని, అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసింది ఎవరూ ఎందుకనే వివరాలు తెలుసుకోవాలన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

తాండూరు: నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుండి పాఠశాలలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తానని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రాంతీయ ఉపాధ్యాయ సంఘం(తపస్) ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఎంపీ పాల్గొన్నారు. విద్యాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తున్నదని అన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

బొంరాస్‌పేట్, జూలై6 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఆదివారం బొంరాస్‌పేట్ మండలంలోని ఏనమీదితండా అనుబంధ గ్రామం సోమ్లానాయక్ తండాలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలను అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో భీమ్‌రెడ్డి, భీమ్‌రావు, మహేందర్, ప్రవీణ్, చందు, మోహన్, చిన్నయ్య, లక్ష్మయ్య, మైమూద్, బాల్‌రాజ్, వడ్ల ప్రసాద్ పాల్గొన్నారు.



వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

రేబిస్ వ్యాధిపై అవగాహన ఉండాలి

షాద్‌నగర్ అర్బన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పెంపుడు జంతువులకు వ్యాక్సిన్లు ఇప్పిస్తూ, వాటికి సోకే ప్రాణాంతకమైన రేబిస్ వ్యాప్తి చెందకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. షాద్‌నగర్ పశు సంవర్ధక ఆసుపత్రిలో ఆదివారం పశు సంవర్ధకశాఖ, యానిమల్స్ కేర్ సొసైటీ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ జూనోసిస్ డేను పురస్కరించుకొని కుక్కలకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లారిముద్దుగా పెంచుకునే కుక్కలకు వ్యాక్సిన్‌ను ఇప్పించకపోతే రేబిస్ వచ్చే అవకాశం ఉందని గుర్తుచేశారు. ప్రతీయేటా విధిగా కుక్కలకు, పిల్లులకు వ్యాక్సిన్లు ఇప్పించి, రేబిస్ లాంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలకుండా కట్టడి చేయాలని ఎమ్మెల్యే కోరారు. ప్రపంచ జూనోసిస్ డేను పురస్కరించుకొని కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ వ్యాక్సిన్‌ను ఇస్తున్నామని పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఇళ్లలో పెంచుకుంటున్న కుక్కలకు విధిగా వ్యాక్సిన్ ఇప్పించాలని వారు సూచించారు. కార్యక్రమంలో పశువైద్యులు ముక్కంటిరాజ్, వంశీకృష్ణారెడ్డి, వెంకటేష్, స్థానికులు పాల్గొన్నారు.

మద్యం సేవించి డ్రైవింగ్ చేయొద్దు



యాచారంలో తనిఖీ నిర్వహిస్తున్న పోలీసులు

యాచారం, జూలై 6(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ఆటోలు, క్రూయిజర్లలో సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని యాచారం సీఐ ఎ.నందీశ్వర్‌రెడ్డి అన్నారు. ఈమేరకు ఆయన వాహనాదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఆదివారం సాయంత్రం మండల కేంద్రంలో విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా వాహనాల తనిఖీ చేపట్టారు. పలు ఆటోలు, క్రూయిజర్లలో సామర్థ్యానికి మించి ప్రయాణికులుండడం చూసి.. మరోమారు ఎక్కించుకోరాదని డ్రైవర్‌లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. మైనర్లకు వాహనాలు అప్పగించరాదని, హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాలు నడిపితే జరిమానా విధిస్తామని తెలిపారు. అతివేగంతో వాహనాలు నడపరాదని కోరారు. వాహనాలు నడిపే సమయంలో సెల్‌ఫోన్‌లో మాట్లాడరాదని సీఐ సూచించారు.



జెండా దిమ్మెకు భూమి పూజ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

దిమ్మె నిర్మాణానికి భూమి పూజ

కడ్తాల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గోవిందాయిపల్లిలో ఎమ్మార్పీఎస్ జెండా దిమ్మె నిర్మాణానికి ఆదివారం భూమి పూజ చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణ, మండలలాధ్యక్షుడు రమేశ్ మాదిగలు పాల్గొన్నారు. అనంతరం నేడు(సోమవారం) నిర్వహించే ఆవిర్భావ దినోత్సవ వేడుకల నేపథ్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. వేడుకలను ఘనంగా జరుపుకోవాలని కృష్ణ పిలుపు నిచ్చారు. మహేశ్, జంగయ్య, ప్రశాంత్, మధు, సైదులు, శ్రీకాంత్, శేఖర్,పవన్, అంజయ్య, శ్రీకాంత్, సంజీవ, రాజు, తదితరులు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

నేటి తరానికి స్ఫూర్తి అంబేడ్కర్

ఘట్‌కేసర్, జూలై 6 (ఆంధ్రజోతి): నేటితరం యువత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వెలిమినేటి సురేష్ అన్నారు. అంబేడ్కర్‌కు నివాళి కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఘట్‌కేసర్‌లోని ఎదులాబాద్ రోడ్డులో గల అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మీసాల అరుణ్‌కుమార్, భరత్, దాసు, రాజేష్, సత్యం, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అదనపు గదుల్లేక అవస్థలు

మర్పల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మర్పల్లి మండలంలోని దామస్తపూర్ తండాలో కొన్నేళ్ల కిందట ఒకే గదితో ప్రాథమిక పాఠశాల నిర్మించారు. అంగన్‌వాడీ నుంచి 5వ తరగతి వరకు ఒకే గదిలో 30 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఆ తండావాసులు పాఠశాల అదనపు గదులు నిర్మించాలని కొన్నేళ్లుగా మొరపెట్టుకుంటున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. అప్పటి నుంచి ఐదో తరగతి వరకు విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఇందుకు తోడు తండాలో అంగన్‌వాడీ భవనం లేక పోవడంతో పాఠశాలలోనే అంగన్‌వాడీని కొనసాగిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో 12 మంది, పాఠశాలలో 22 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఉన్న పాఠశాల శిథిలావస్థకు చేరడంతో ఇబ్బందులు తప్పడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తండాలో పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని తండావాసులు కోరుతున్నారు.



దామస్తాపూర్ తండా ప్రాథమిక పాఠశాల

భక్తిశ్రద్ధలతో యజ్ఞం



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కేశంపేట, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శివ సీతారామాంజేయస్వామి ఆలయంలో ఆదివారం చాతురామాస్య యజ్ఞం ప్రారంభించారు. ఆషాడ శుద్ధ ఏకాదశి మొదలుకొని కార్తీక శుద్ధ ద్వాదశి వరకు నాలుగు నెలలు పూజలు నిర్వహించనున్నట్లు భక్తులు తెలిపారు. చాతురామాస్య ప్రారంభోత్సవంలో భాగంగా యజ్ఞం నిర్వహించారు. నాలుగు నెలలు నిర్విరామంగా పూజలు కొనసాగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ మఠం చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు తలసాని వెంకట్ రెడ్డి, యెన్నం శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ యాదయ్య చారి, ఎద్మ విజయ రెడ్డి, తలసాని ప్రభాకర్‌రెడ్డి, జూలపల్లి అనసూయమ్మ, తలసాని బాల్ రెడ్డి, ఇరువెంటి రాఘవేందర్, నర్సింహ, కడియాల శేఖర్ భక్తులు పాల్గొన్నారు.

గోరింటాకు సంబురాలు



భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టేలా ఆరోగ్యంతో పాటు అందంగా ఉండే విధంగా ఔషధకారిగా ఉపయోగపడే గోరింటాకుతో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని మహిళలు సంబురాలు జరుపుకున్నారు. ఆదివారం షాబాద్ మండల కేంద్రంలో ప్రత్యేక రంగ వల్లులు, ఆటపాటలతో ఉత్సాహంగా గోరింటాకు వేడుకను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఆషాఢ మాసంలో సహజ సిద్ధమైన గోరింటాకును పెట్టుకోవడం మహిళలకు ఆసక్తితో పాటు ఎంతో శుభప్రదమని మహిళలు గుర్తుచేసుకున్నారు. వేడుకలో మంజుల, భారతమ్మ, ప్రసన్న, ప్రశాంతి, రాధిక, లక్ష్మమ్మ, విజయ, హరిణి, సుగుణ, వృంద తదితరులు పాల్గొన్నారు.

- షాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి)

సీసీ రోడ్డు వేశారు.. నీళ్లు పట్టడం మరిచారు

- ఎన్‌ఎఫ్‌సీ నగర్‌లో రూ.20లక్షలతో రోడ్డు
- స్థానికులే నీళ్లు పడుతున్న వైనం
- అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం



ఎన్ఎఫ్‌సీనగర్‌లో నీళ్లులేక ఎండిపోయిన సీసీరోడ్డు



సీసీరోడ్డుకు నీళ్లు పడుతున్న స్థానికులు

ఘట్‌కేసర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): లక్షల రూపాయల ప్రజాధనం వెచ్చించి నిర్మించిన సీసీరోడ్డుకు అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో నాణ్యత దెబ్బతింటోంది. మున్సిపాలిటీ పరిధిలోని ఎన్ఎఫ్‌సీనగర్‌లో కాలనీలో రూ.20లక్షలతో సీసీరోడ్డు నిర్మించారు. గత శుక్రవారం నుంచి మంగళవారం వరకు ఐదు రోజుల పాటు రోడ్డు నిర్మాణం పూర్తిచేశారు. అయితే సీసీరోడ్డు గట్టిపడేందుకు నీటిని పోయాల్సి ఉండగా కాంట్రాక్టర్ నీళ్లు పట్టించడంలేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ఈవిషయాన్ని మున్సిపల్ అధికారులకు తెలిపినా ఏ మాత్రం చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. పేరుకు సీసీరోడ్డుపై మట్టితో కట్టలు కట్టారు తప్ప ఏరోజూ రోడ్డుపై సరైన విధంగా నీళ్లు ఉంచలేదని ఇలా అయితే రోడ్డు ఎలా గట్టిపడుతుందని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లోపించడంతో కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపిస్తున్నారు. చేసేది లేక తామే తమ ఇంటి ముందు రోడ్డుకు నీళ్లు పడుతున్నామని పలువురు చెబుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి సీసీరోడ్డు నిత్యం తడిగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

నీళ్లు పట్టేలా చర్యలు చేపట్టాలి



ఎన్ఎఫ్‌సీనగర్ కాలనీలోని బీ-2లో నిర్మించిన సీసీరోడ్డుకు నీళ్లు పట్టించడంలేదు. ఇలా అయితే రోడ్డు నాణ్యత దెబ్బతింటుంది. కొత్తగా వేసిన రోడ్డుకు నీళ్లు లేక ఎండిపోతుండటంతో చూడలేక మేమే బోరుతో నీళ్లు పట్టిస్తున్నాం. నాప్లాటు ముందు అటుఇటు మరికొంత దూరం వరకు పడుతున్నాను. రోడ్డు మొత్తం పట్టడం నా వల్ల అయ్యే పనికాదు.

ఓర్సు వెంకటేష్, స్థానికుడు, ఎన్ఎఫ్‌సీనగర్

రోడ్డు నాణ్యత దెబ్బతింటోంది



కొత్తగా వేసిన సీసీరోడ్డుకు నిత్యం నీళ్లను పెట్టాలి. కానీ ఎన్ఎఫ్‌సీనగర్ కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డుకు నీళ్లలేక నాణ్యత దెబ్బతినే అవకాశాలు ఉన్నాయి. అధికారులు సీసీరోడ్డును పరిశీలించి మరో వారం రోజులైనా నిత్యం నీళ్లు పెట్టేలా చర్యలు తీసుకోవాలి.

వెంకట్‌రావు, స్థానికుడు, దత్తాత్రేయ నగర్

పదేళ్లలో బీఆర్ఎస్ ఒక్క ఇల్లూ పంపిణీ చేయలే..

- కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి



మంచాల : మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి, జయమ్మ

మంచాల, జూలై 6(ఆంధ్రజ్యోతి): పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదోడికి ఒక్క ఇళ్లు కూడా పంపిణీ జరగలేదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి విమర్శించారు. మంచాలలో మాజీ ఎంపీపీ గుండెమోని జయమ్మ, పీఏసీఎస్ చైర్మన్ వెదిరె హన్మంత్‌రెడ్డిలతో కలిసి ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిపై నిప్పులు చెరిగారు. నీళ్లు, నిధులు, నియామకాలే లక్ష్యంగా అమరుల త్యాగాలతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక తెలంగాణ ఏర్పాటుచేసిందని తెలిపారు. కానీ, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కల్వకుంట్ల కుటుంబం తెలంగాణను అన్నిరంగాల్లో దోపిడీకి గురిచేసిందని దుయ్యబట్టారు. లింగంపల్లి గేటువద్ద ఇళ్ల నిర్మించి ఐదేళ్లు గడిచాయని, ఇళ్ల పంపిణీ ఎందుకు చేపట్టలేదో మంచిరెడ్డి కిషన్‌రెడ్డి చెప్పాలని అన్నారు. ప్రజాసంక్షేమానికి అహర్నిషలు కృషి చేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని విమర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కాంగ్రెస్ పాలనలోనే అన్నివర్గాలకు సమన్యాయం జరుగుతుందని చెప్పారు. సమావేశంలో ఏపీసీఎస్ డైరెక్టర్లు జెనిగె వెంకటేష్‌యాదవ్, రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ ఎడమ నరేందర్‌రెడ్డి, కె.శ్రీనివాస్, కావలి శ్రీనివాస్, జయానందం, మూర్తి, సదానందం, గోరె వీరేష్, అయిలయ్య, శ్రీనివాస్, మార సురేష్, వెంకటేష్, బి.కుమార్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

మంచిరెడ్డిపై విమర్శలు చేస్తే జనం హర్షించరు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఇబ్రహీంపట్నం, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో బీఆర్ఎస్ హయాంలో మంచిరెడ్డి కిషన్‌రెడ్డి చేసిన అభివృద్ధి తప్పితే.. 18 నెలల కాలంలో కాంగ్రెస్ చేసిందేమీలేదని, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మెప్పుకోసం కిషన్‌రెడ్డిని తూలనాడితే ప్రజలు హర్షించరనే విషయం గుర్తెరగాలని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. కొందరు కిషన్‌రెడ్డిపై అవాకులు, చవాకులు పేలుతున్నారని, అభివృద్ధిపై చర్చకు రావాలంటూ సవాల్ చేశారు. ఆదివారం ఇబ్రహీంపట్నంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ మండలాధ్యక్షుడు చిలుకల బుగ్గరాములు, మాజీ ఎంపీపీ కృపేష్, బీఆర్ఎస్వీ నియజకవర్గ అధ్యక్షుడు నిట్టు జగదీశ్వర్‌లు మాట్లాడారు. మంచాల మండలం లింగంపల్లి గేట్ వద్ద 96 డబుల్ బెడ్‌రూం ఇళ్ల బ్లాక్‌ను మంచిరెడ్డి కిషన్‌రెడ్డి హయాంలో నిర్మించారని శనివారం ఈ ఇళ్లను సందర్శించిన మంచిరెడ్డి తాగునీటి వసతితోపాటు కనీస వసతులు కల్పించాలని లబ్ధిదారులకు కేటాయించాలని అధికార యంత్రాంగాన్ని ఆయన డిమాండ్ చేస్తే.. కొందరు కాంగ్రెస్ నాయకులు ఇదేదో తప్పయినట్లు మాట్లాడారంటూ మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో రూ.వేల కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేశారని, అవి వారి కళ్లకు కనబడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. మంగల్‌పల్లి, దండుమైలారం ప్యాక్స్ చైర్మన్లు మంచిరెడ్డి మహేందర్‌రెడ్డి, బిట్ల వెంకట్‌రెడ్డి, నాయకులు డి.నర్సింహ, భాస్కర్ రెడ్డి, బూడిద నర్సింహారెడ్డి, గోపాల్ తదితరులున్నారు.

గుండెపోటుతో బ్యాంకు మేనేజర్ మృతి



భువన్ మోహన్(ఫైల్)

తాండూరు రూరల్, జూలై 6, (ఆంధ్రజ్యోతి): కరన్‌కోట్ ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ భువన్ మోహన్ గుండెపోటుతో మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి. కరన్‌కోట్ ఎస్‌బీఐ బ్యాంకులో మేనేజర్‌గా పనిచేస్తున్న భువన్ మోహన్ శనివారం విధులకు హాజరయ్యారు. అనంతరం సాయంత్రం వేళ విధులు ముగించుకుని బ్యాంకుకు తాళం వేసి ఆదివారం సెలవు కావడంతో హైదరాబాద్‌లోని ఇంటికి వెళ్లాడు. ఆదివారం మధ్యాహ్నం తన నివాసంలో ఉండగా భువన్ మోహన్ ఉన్నట్టుండి ఛాతిలో నొప్పి రావడంతో గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. బ్యాంకు మేనేజర్ మృతి పట్ల కరన్‌కోట్ గ్రామస్తులు మాజీ ఎంపీపీ శరణుబసప్ప, మాజీ ఎంపీటీసీ రాజ్‌కుమార్, మాజీ ఉపసర్పంచ్ హేమంత్‌కుమార్, కరన్‌కోట్ సీసీఐ కర్మాగారం ఉద్యోగులు పలువురు, కరన్‌కోట్ సీసీఐ ప్యాకింగ్ ప్లాంట్ కాంట్రాక్టర్ విచారం వ్యక్తం చేశారు.

రౌండ్‌టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలి



పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

కేశంపేట, జూలై 6(ఆంధ్రజ్యోతి): బీసీల హక్కుల సాధన, విద్య, ఉద్యోగాలు, ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ అమలుపై ఈ నెల 12న కేశంపేటలో నిర్వహించనున్న రౌండ్‌టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుడు సీమల రమేష్ కురుమ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం చలో కేశంపేటకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశానికి తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హాజరవుతారని తెలిపారు. బీసీల హక్కుల సాధనే ధ్యేయంగా నిర్వహించే రౌండ్‌టేబుల్ సమావేశానికి పెద్ద సంఖ్యలో బీసీలు హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు ఎదిరే వెంకటయ్య, అశోక్, సీమల శ్రీనివాస్, పల్లాటి కృష్ణయ్య, గుత్తి రంగయ్య, తిరుపతయ్య, నక్క గోపాల్ యాదవ్, వెంకటయ్య, వల్కే శ్రీనివాస్, శేఖర్, రాఘవేందర్, సూరమోని లింగస్వామి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న శ్రీకాంత్

మొయినాబాద్ రూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని బీజేపీ మొయినాబాద్ మున్సిపల్ అధ్యక్షుడు మదాపురం శ్రీకాంత్ అన్నారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ చౌరస్తాలోని కంజర్ల మాల్‌లో హిమాయత్ నగర్ బూత్ అధ్యక్షులు, బీజేపీ నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతీఒక్కరు పార్టీ ఆదేశాలనుసారం పనిచేయాలని, కష్టపడితే భవిష్యత్తులో మంచి అవకాశాలు ఉంటాయని సూచించారు. వ్యక్తిగత నిర్ణయాలతో పార్టీకి నష్టం చేకూర్చవద్దని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపుకోసం పనిచేయాలన్నారు. ఓబీసీ సెల్ జిల్లా నాయకుడు శ్రీనివాస్‌గౌడ్, నూనె మురళి, జల్లెల రవి, ఎల్గని నవీన్ గౌడ్, బుర్రకాయల రాజు, బి.రాజు, రాజు సాగర్, షాబాద్ కిషన్, కాసుల సురేష్ గౌడ్, బాబు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



ఉత్తమ వైద్యులను సన్మానిస్తున్న క్లబ్ నూతన అధ్యక్షులు శరణు బసప్ప, తదితరులు

తాండూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తాండూరు లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గంతో ఆదివారం లయన్స్‌క్లబ్ పాస్ట్ జిల్లా గవర్నర్ హరినారాయణ్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ బాలకృష్ణారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేశారు. తాండూరులో ఉత్తమ వైద్యుడు అభిషేక్, ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఈ సందర్భంగా సన్మానించారు. నూతన అధ్యక్షుడిగా శరణుబసప్ప, కో-ఆర్డినేటర్‌గా రొంపల్లి సంతోష్‌కుమార్, ఉపాధ్యక్షులుగా మురళి మోహన్, మహ్మద్ యూసుఫ్, వీర ప్రసాద్, కార్యదర్శిగా మంకాల్ నటరాజ్, సహకార్యదర్శిగా గూళి శివకుమార్, కోశాధికారిగా గౌరిశంకర్, మెంబర్‌షిప్ కమిటీ చైర్మన్‌గా ఓంప్రకాష్ సోమాని, క్లబ్ మార్కెటింగ్ చైర్మన్‌గా పసారం బస్వరాజ్, క్లబ్ అడ్మినిస్ట్రేటివ్‌గా సల్లా దామోదర్, క్లబ్ కో ఆర్డినేటర్‌గా వై.బసనప్ప ప్రమాణ స్వీకారం చేశారు.

నేరాల అదుపునకు సహకరించాలి



ఎస్ఐ రమేశ్‌కుమార్‌ను సన్మానిస్తున్న దళిత, అంబేడ్కర్, బహుజన సంఘాల నాయకులు

కులకచర్ల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నేరాల అదుపునకు అందరూ సహకరించాలని ఎస్ఐ రమేశ్‌కుమార్ అన్నారు. పుట్టపహాడ్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులను త్వరలోనే గుర్తించి రిమాండ్ చేస్తామన్నారు. పీఎస్ ఆవరణలో ఆదివారం ఎస్ఐ రమేశ్‌కుమార్‌ను దళిత, అంబేడ్కర్, బహుజన సంఘాల ఆధ్వర్యంలో ఎస్సైను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, కేబీ.రాములు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు, సొసైటీ చైర్మన్ కనకం మొగులయ్య, బ్లాక్ టు అధ్యక్షుడు భరత్‌కుమార్, సత్యహరిశ్చంద్ర, గోపాల్‌నాయక్ పాల్గొన్నారు.

తొలి ఏకాదశి ప్రత్యేక పూజలు


చౌదరిగూడ : కొందుర్గు లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో భక్తులు


చేవెళ్ల : వేంకటేశ్వరాలయంలో దర్శనం కోసం బారులు తీరిన భక్తులు


మంచాల : తాళ్లపల్లిగూడ శివాలయంలో పూజలు


శంకర్‌పల్లి : చందిప్ప మరకత శివాలయంలో లింగానికి అభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం జిల్లావ్యాప్తంగా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఈమేరకు నిర్వాహకులు ఆలయాలను పచ్చటి తోరణాలు, పుష్పాలతో అలంకరించారు. ఉదయం నుంచి రాత్రి వరకు ప్రధాన ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. ఉదయం ఉపవాస దీక్షలు చేపట్టిన భక్తులు సాయంత్రం ఆలయాలకు వెళ్లి పూజలు, వ్రతాలు, అభిషేకాలు నిర్వహించి దీక్ష విరమించారు.


కడ్తాల్ : మైసిగండిలో నిర్వహించిన పూజల్లో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అభినవ్‌రెడ్డి


షాబాద్ : నాగర్‌గూడ శ్రీకృష్ణ మందిరంలో పూజల్లో భక్తులు

క్రైం కార్నర్

బైక్‌ను ఢీకొన్న డీసీఎం.. వ్యక్తి దుర్మరణం

షాద్‌నగర్ రూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బుచ్చిగూడ రోడ్డులో ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందాడు. ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. బాలానగర్ మండలం పెద్దాయపల్లికి చెందిన విష్ణు (36) బైక్‌పై వెలిజర్ల వెళ్తుండగా చటాన్‌పల్లి పౌల్ట్రీ ఫామ్స్ వద్ద ఎదురుగా వచ్చిన డీసీఎం వ్యాన్ ఢీకొంది. అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. మృతుడు విష్ణు భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి

తలకొండపల్లి, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రామకృష్టాపురం గ్రామంలో విద్యుదాఘాతానికి గురై రెండు గేదెలు మృతిచెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. రైతు సింగిరెడ్డి యలమందరెడ్డికి చెందిన రెండు గేదెలు పశుగ్రాసం మేస్తుండగా తెగిపడిన విద్యుత్ తీగలను తాకడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాయి. వాటి విలువ సుమారు రూ.2.35 లక్షలు ఉంటుందని యలమందరెడ్డి తెలిపారు. ప్రభుత్వ పరంగా తనను ఆదుకోవాలని ఈ సందర్భంగా కోరాడు.

పాముకాటుతో పాడి గేదె

యాచారం, జూలై 6(ఆంధ్రజ్యోతి): పాముకాటుతో పాడి గేదె మృతిచెందిన ఘటన ఆదివారం యాచారం మండలం కొత్తపల్లిలో జరిగింది. కొత్తపల్లికి చెందిన జి.జంగయ్య పాడిగేదెను శనివారం సాయంత్రం పంట పొలం వద్ద దొడ్డిలో కట్టేసి ఇంటికొచ్చాడు. ఈక్రమంలో ఆదివారం ఉదయం పాలు పితకడానికి వెళ్లగా గేదె పాముకాటుతో మరణించి ఉంది. దాని విలువ రూ.50వేలు ఉంటుందని బాధితుడు చెప్పాడు.

'ఇందిరమ్మ' బిల్లు ఇంకా రాలే!

(ఐదో పేజీ తరువాయి)


శంకర్‌పల్లిలో నిర్మాణంలో ఉన్న ఇల్లు

నిర్మాణాన్ని 400 నుంచి 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో చేపట్టాలి. 600 చదరపు అడుగుల పైన ఉన్న ఇంటిని రద్దు చేయాలని ప్రభుత్వం సూచించింది. ఇప్పటికే చాలామంది బేస్‌మెంట్ లెవల్ వరకు నిర్మాణం పూర్తిచేసుకున్నారు. కొందరు గోడలు కట్టడం కూడా ప్రారంభించారు. ఇలా పైలెట్ గ్రామా ల్లో ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. అయితే ఇప్పటివరకు జరిగిన పనులకు బిల్లులు రాక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు.

అందని సూక్ష్మరుణాలు

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరు చేసే రూ.5 లక్షల సాయాన్ని నాలుగు విడతల్లో అందజేయాలని నిర్ణయించింది. ముందుగా పునాది స్థాయిలో నిర్మాణం పూర్తయితే రూ.లక్ష బిల్లు లబ్ధిదారుల అకౌంట్లో జమ చేస్తారు. అయితే చాలామంది పేదలు చేతిలో డబ్బులు లేక ఇళ్ల నిర్మాణానికి ముందుకు రాలేదు. ఇలాంటి వారి కోసం స్వయం సహాయక సంఘాల ద్వారా రూ. 50వేలు, రూ.లక్ష వరకు సూక్ష్మ రుణాలు ఇప్పించి వారి కల నెరవేర్చాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఈ సూక్ష్మ రుణాలు సైతం అందకపోవడం లబ్ధిదారులకు శాపంగా మారింది. ఇంతకుముందే లోన్ తీసుకున్న గ్రూపుల్లో సభ్యులుగా ఉండటం, తీసుకున్న వాటిని సక్రమంగా చెల్లించలేకపోవడం తదితర కారణాలతో బ్యాంకర్లు మళ్లీ రుణాలు ఇచ్చేందుకు ని రాకరిస్తున్నట్లు తెలుస్తోంది. కొత్తగా సభ్యులతో గ్రూ పు ఏర్పాటు చేసినా కావాల్సినంత రుణం ఇవ్వడం లేదు.

ఇంటి నిర్మాణం ప్రారంభించకుంటే రద్దు

చేతిలో డబ్బులు లేక, ముడి సరుకు, కూలీల ధరలు రెట్టింపు తదితర కారణాలతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టడానికి చాలామంది లబ్ధిదారులు వెనుకాడుతున్నారు. అంతేకాకుండా నిర్మాణం 600 చదరపు అడుగులు మించకూడదనే నిబంధన కూడా నిర్మాణాలకు అడ్డంకిగా మారింది. దీంతో జిల్లాలో ఇప్పటి వరకు 6,713 మంది లబ్ధిదారులు ఇంకా ఇంటి నిర్మాణానికి ముగ్గు కూడా పోయలేదు. అయితే, ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. 30 రోజుల్లోగా నిర్మాణం ప్రారంభించకుంటే మంజూరును రద్దుచేసి మరో లబ్ధిదారుడికి అవకాశం ఇవ్వాలని నిర్ణయించింది. దీంతో లబ్ధిదారులు ఏంచేయాలో తెలియక ఆందోళన చెందుతున్నారు.

ధరాఘాతం

(ఐదో పేజీ తరువాయి)

ప్రస్తుత ధరల్లో చాలా వ్యత్యాసం ఉంది. బయట డంగుల్లో ఇసుక అమ్మకాలను నిషేధించిన ప్రభుత్వం ఇసుక బజార్‌లను ఈ మధ్యనే ప్రారంభించింది. ఆదిభట్ల, అబ్దుల్లాపూర్‌మెట్‌లలో వీటిని ఏర్పాటు చేసింది. దొడ్డు ఇసుక (టన్నుకు) రూ. 1600, సన్న ఇసుక (టన్నుకు) రూ.1800కు విక్రయిస్తున్నారు. కాగా ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం మండలాల్లోని గ్రామాలకు ఇందిరమ్మ లబ్ధిదారులు ఇక్కడ నుంచి ఇసుక తీసుకెళ్లాలంటే ట్రాక్టరుకు రూ.1500 నుంచి రూ.2000 కిరాయి అవుతుంది. దీంతో బయట లారీల వద్దే కొనాల్సి వస్తోంది. కాగా బేస్‌మెంట్, పిల్లర్ల వరకు ఇంటి నిర్మాణం పూర్తయినా మొదటి విడత నిధులు రాలేదని కొందరు లబ్ధిదారులు వాపోతున్నారు.

ధరలు ఇలా.. (రూపాయలలో)

నిర్మాణ సామగ్రి	45 రోజుల క్రితం	ప్రస్తుతం
మట్టి టిప్పర్ (20-25 టన్నులు)	3500-4000	6000-6500
దొడ్డు ఇసుక (టన్నుకు)	1550	2100
సన్న ఇసుక (టన్నుకు)	1700-1800	1900-2000
సన్న కంకర (టన్నుకు)	500-550	600
డస్టు (టన్నుకు)	500	600
ఇటుక (ఒకటి)	9-10	9-10
గ్రనేట్ (ఒకటి)	18	22
స్టీల్ టీఎంటీ (టన్నుకు)	రూ. 55,000- 58000	
సిమెంట్ బస్తాకు (కంపెనీని బట్టి)	రూ.300-340	
లేబర్	45 రోజుల క్రితం	ప్రస్తుతం
మేస్త్రీకి రోజుకు (కంకర, ఫ్లోరింగ్)	రూ.1200	రూ.1500
పార పని, కట్టుడుకు	రూ.1200	రూ.1300
మహిళలకు	రూ.800	రూ.900

మొదటి విడత డబ్బులు రాలే..

ఇంటి నిర్మాణం బేస్‌మెంట్ వరకు పూర్తయితే రూ.లక్ష ఇస్తామన్నారు. 20 రోజుల క్రితమే అంతవరకు పనులు పూర్తయి పిల్లర్లు కూడా వేశాం. మెటీరియల్, మేస్త్రీకి అప్పు చేసి సర్దుబాటు



చేశా. మొదటి బిల్లుకోసం ఎదురుచూస్తున్న. అప్పుడు ఇప్పుడు అంటున్నారే కానీ చేతికి ఎప్పుడొస్తాయో తెలియడం లేదు.

- గోల్కొండ శ్రీలత, లబ్ధిదారు, ఇబ్రహీంపట్నం

వన మహోత్సవానికి వేళాయే..

(ఐదో పేజీ తరువాయి)

నర్సరీల్లో మొక్కలు సిద్ధం చేశారు. ప్రభుత్వ స్థలాలు, రహదారులకు ఇరువైపులా, పొలం, చెరువుగట్లు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ సంస్థలు, పరిశ్రమలు, కమ్యూనిటీ కేంద్రాలు, వైద్యశాలలు, కళాశాలలు, పాఠశాలల ఆవరణంలో మొక్కలు నాటనున్నారు.

జిల్లాలో 78.54 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం

ప్రభుత్వ లక్ష్యం మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలు, గ్రామాలు, మున్సిపాలిటీల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. 11వ విడత వన మహోత్సవంలో జిల్లాలో 78.54 లక్షలు నాటేందుకు ఆయా ప్రభుత్వ శాఖలకు టార్గెట్ విధించారు. ఇందులో అన్ని శాఖలను భాగస్వామ్యం చేస్తున్నారు. ఈసారి డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో 3,31,9434, అటవీశాఖ ఆధ్వర్యంలో 7,38,629, జిల్లా విద్యాశాఖ 1,31,898 మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించారు. వ్యవసాయశాఖకు 4,52,850, నీటి పారుదల శాఖకు 1,09,915, సరూర్ నగర్ ఎక్సైజ్ శాఖకు 46164, శంషాబాద్ ఎక్సైజ్‌శాఖకు 46164 మొక్కలు నాటాలని టార్గెట్ విధించారు. డీఎంహెచ్‌వో 9233, పరిశ్రమల శాఖకు 2,30822, ఉద్యాన శాఖకు 1,80,261, దేవదాయ శాఖకు 9233, సాంఘిక సంక్షేమ శాఖకు 9,233, గిరిజన సంక్షేమ శాఖకు 4,616, మైన్స్ శాఖకు 8,7932, మార్కెటింగ్ శాఖ 9233, సివిల్‌సప్లయ్ శాఖకు 4,616 మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించారు. మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లకు కలిపి మొత్తం 24,63,767 మొక్కలు నాటేలా లక్ష్యం నిర్దేశించారు.

ప్రతీ ఇంటికి మొక్కల పంపిణీ

వన మహోత్సవంలో భాగంగా ప్రతీ ఇంటికి మొక్కలు పంపిణీ చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గులాబీ, మందార, గన్నేరు, సీతాఫలం, జామ, ఉసిరి, అల్లనేరేడు, మునగ, కానుగ, తులసీ, ఈత, డ్రాగన్, ఔషధ మొక్కలు పంపిణీ చేయనున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, స్థలాలు, అటవీ ప్రాంతాలు, రహదారులకు ఇరువైపులా, పొలం, చెరువు గట్లు, పరిశ్రమలు, కాలేజీల ఆవరణల్లో విస్తృతంగా మొక్కలు నాటనున్నారు. ఇందుకోసం జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, యువజన సంఘాల సహకారం తీసుకోనున్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం


కడ్తాల : మక్తమదారంలో నిర్వహించిన వేడుకల్లో ఆమనగల్లు ఏఎంసీ చైర్‌పర్సన్ గీతానర్సింహ


కొత్తూర్ : షర్బత్ పంపిణీ చేస్తున్న భక్తులు

షాద్‌నగర్ అర్బన్/ఆమనగల్లు/కడ్తాల్/తలకొండపల్లి/కొత్తూర్/చౌదరిగూడ/ కందుకూరు/ షాబాద్ , జూలై 6 (ఆంధ్రజ్యోతి): కుల, మతాలకు అతీతంగా ఊరూరా మొహర్రం జరుపుకున్నారు. తొమ్మిది రోజుల క్రితం పీర్ల చావిడిలో నిలిపిన పీర్ల ఎదుట నిత్యం రాత్రి కాగానే గ్రామస్థులు అలావు ఆడి, ఆదివారం నిమజ్జన కార్యక్రమాన్ని పూర్తిచేశారు. గ్రామాల్లో వీధుల్లోకి వచ్చిన పీర్లకు కుల, మతాలకు అతీతంగా భక్తులు బెల్లం నైవేద్యంగా ఇచ్చి ఆశీర్వాదం తీసుకున్నారు. గ్రామాల్లో హిందు వులు సైతం పీర్లను ఎత్తుకోవడంతో పాటు ఉత్సవంలో ఉల్లాసంగా పాల్గొన్నారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండల కేంద్రాలతోపాటు పలు గ్రామాల్లో మొహర్రంను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ సంకటోనిపల్లిలో నాయకులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆమనగల్లు పట్టణంలో పీర్ల చావిడి వద్ద జరిగిన పూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పట్టణంలో పీర్లతో భారీ ఊరేగింపు నిర్వహించారు. బస్టాండ్ ఎదుట ముస్లింలు పాయసం పంపిణీ చేశారు. మైనార్టీ నాయకులు తదితరులున్నారు. తలకొండపల్లి మండలం వెల్జాల్, గట్టిప్పలపల్లి, జూలపల్లి తదితర గ్రామాల్లో మొహర్రం జరుపుకున్నారు. మక్తమాదారంలో మార్కెట్ చైర్‌పర్సన్ గీత నర్సింహ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మాజీ సర్పంచ్ సులోచనసాయిలు, మాజీ ఎంపీటీసీ మంజులచంద్రమౌళి, నాయకులు పాల్గొన్నారు. కొత్తూర్ మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో మొహర్రం జరుపుకున్నారు. పీర్లను భక్తులు ఊరేగింపు నిర్వహించి నిమజ్జనం చేశారు. చౌరస్తా వద్ద ముస్లింలు షర్బత్ పంపిణీ చేశారు. యాసీన్ మజీద్, సద్దాం ఖమర్‌అబీబ్, సందీప్, అయూబ్, హనీఫ్, నిజాం తదితరులు పాల్గొన్నారు. కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లో మొహర్రం జరుపుకున్నారు. కొందుర్గు మండల కేంద్రంతో మాజీ వైస్‌ఎంపీపీ రాజేష్ పటేల్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం రావిర్యాలలో మొహర్రం జరుపుకున్నారు. కందుకూరు మండలంలో మొహర్రం జరుపుకున్నారు. కొత్తగూడ, నేదునూరు, దాసర్లపల్లి, గూడూరు. పులిమామిడి తదితర గ్రామాల్లో పీర్లను ఊరేగింపుగా తరలించి నిమజ్జనం చేశారు. షాబాద్ మండలం షాబాద్, బొబ్బిలిగామ, నాగర్‌గూడ, నాగర్‌కుంట, మన్‌మర్రి, బోడంపహాడ్, రేగడిదోస్వాడ, సర్దార్‌నగర్, పోతుగల్, హైతాబాద్ తదితర గ్రామాల్లో మొహర్రం జరుపుకున్నారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ గ్రామంలో పీర్లను ఊరేగించారు.


కందుకూరు : నేదునూరులో..


చౌదరిగూడ : రావిర్యాలలో పీర్ల ఊరేగింపు

బీఆర్ఎస్ నాయకులపై పోలీసులకు ఫిర్యాదు

షాద్‌నగర్‌రూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై బెదిరింపు ధోరణిలో మాట్లాడిన స్థానిక బీఆర్ఎస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కేసు విచారిస్తున్న సిట్ నుంచి తమకు పిలుపు వచ్చిందని, తమ ఫోన్లు కూడా ట్యాప్ అయినట్లు సంబంధిత అధికారులు వాగ్మూలం ఇవ్వాలని తమకు చెప్పారని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో షాద్‌నగర్‌కు చెందిన ఓ యువ నాయకుడి ప్రమేయం ఉన్నట్లు తాము అనుమానం వ్యక్తం చేశామని తెలిపారని అన్నారు. అయితే, బీఆర్ఎస్‌కు చెందిన కొందరు నాయకులు ఎమ్మెల్యే శంకర్‌కు ధైర్యముంటే 24 గంటల్లో యువ నాయకుడి పాత్ర గుర్చి బయట పెట్టాలని బెదిరించే ధోరణిలో మాట్లాడారని తెలిపారు. తాము పార్టీ పేరు, యువ నాయకుడి పేరు ప్రస్తావించక పోయినా బీఆర్ఎస్ నాయకులు ప్రెస్‌మీట్ పెట్టి బెదిరింపులకు పాల్పడ్డారని తెలిపారు. సదరు నాయకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాబర్ ఖాన్, రఘునాయక్, ఇబ్రహీం, తిరుపతిరెడ్డి, తదితరులు ఉన్నారు.

విద్యార్థులను ప్రభుత్వ కాలేజీలో చేర్పించండి

మాడ్గుల, జూలై 6(ఆంధ్రజ్యోతి): టెన్త్ పాసైన విద్యార్థినీ విద్యార్థులను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించాలని ప్రిన్సిపాల్ సబేరా ఖాతూన్ తెలిపారు. ఈమేరకు ఆదివారం ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ కాలేజీలో ఎంపీసీ, బీపీసీతో పాటు ఇతర గ్రూపులు బోధిస్తున్నామని, 12మంది లెక్చరర్లు ఉన్నారని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు కాలేజీలో స్టూడెంట్స్‌ను చేర్పించేందుకు సహకరించాలని ప్రిన్సిపాల్ కోరారు.

పెంపుడు జంతువులపై శ్రద్ధ చూపాలి

షాబాద్, జూలై 6(ఆంధ్రజ్యోతి): పెంపుడు జంతువులకు సోకే రోగాలను నివారించేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రేగడిదోస్వాడ పశు వైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. వరల్డ్ జునోసిస్ డేను పురస్కరించుకొని మండల పరిధిలోని రేగడిదోస్వాడ గ్రామంలో పెంపుడు జంతువులకు యాంటీ రేబిస్, వ్యాధినిరోధక టీకాలను ఇచ్చారు. ప్రతి ఒక్కరూ పెంపుడు జంతువులకు వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది. గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం : జునోసిస్ డే సందర్భంగా ఇబ్రహీంపట్నం పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలు, పిల్లులకు రేబిస్ టీకాలు వేశారు. జంతువుల నుంచి మనుషులకు సోకే వ్యాధులపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని పశుసంవర్ధక శాఖ ఇబ్రహీంపట్నం సహాయ సంచాలకులు డా.వసంతకుమారి అన్నారు. పిచ్చి కుక్కలు, పిల్లుల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి ఆనంద్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆమనగల్లు : ప్రపంచ జునోసిస్ డే సందర్భంగా పశువైద్యశాఖ ఆధ్వర్యంలో రేబిస్ నివారణ టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. పశువైద్య అధికారి చింతోజు అగ్నివేష్ ఆధ్వర్యంలో పశువైద్య ఆసుపత్రిలో 63 కుక్కలు రేబిస్ నివారణ టీకాలు వేశారు. పెంపుడు కుక్కల యజమానులకు రేబిస్ వ్యాధి పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తలకొండపల్లి మండల పశువైద్య అధికారి డాక్టర్ విజయ్‌కుమార్, పశువైద్య సిబ్బంది సులేమాన్, బురాన్, పాలాక్ష, అఫ్సర్, హరీశ్, ప్రకాశ్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.


ఇబ్రహీంపట్నం : కుక్కలకు టీకాలు వేస్తున్న పశు వైద్యాధికారులు

శ్యామా ప్రసాద్ ఆశయాలను కొనసాగిద్దాం


షాద్‌నగర్ రూరల్ : మొక్కలు నాటుతున్న బాబయ్య, శ్రీవర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్ రూరల్/షాద్‌నగర్ అర్బన్/ యా చారం, జూలై6(ఆంధ్రజ్యోతి): జన్ సంఘ్ వ్యవస్థాపకులు శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆశయాలను కొనసాగించేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య, శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆయన జయంతిని పురస్కరించుకొని ఆదివారం ఫరూఖ్‌నగర్ మండలం గుండ్యానాయక్ తండాలో గ్రామస్తులతో కలిసి మొక్కలు నాటారు. పార్టీ మండలాధ్యక్షుడు సురేష్, నాయకులు శివశంకర్, వినోద్ కుమార్, ప్రశాంత్, విష్ణు, శ్రీనివాస్, మహేష్ తదితరులు పాల్గొన్నారు. వాయు కాలుష్యాన్ని అరికట్టి ప్రాణ వాయువును పెంచుకోవడానికి ప్రతీఒక్కరు మొక్కలను నాటి సంరక్షించుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్యలు పిలుపునిచ్చారు. బీజేపీ షాద్‌నగర్ పట్టణ అధ్యక్షుడు కోరమోని హరిభూషన్ ఆధ్వర్యంలో ఆదివారం శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతిని పురష్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బీజేపీ పిలుపు మేరకు మాకే నామ్‌పే ఏక్ పేడ్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో మొక్కలను నాటి నీరుపోశారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీఒక్కరు మొక్కను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు శేరి విష్ణువర్ధన్ రెడ్డి, ప్యాట అశోక్, రుషికేశ్, జె.నర్సింహ, పసుపుల ప్రశాంత్, ఎం. రాము, రామకృష్ణ, కాసోజు శివ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆశయ సాధనకోసం యువత పాటు పడాలని బీజేపీ యాచారం మండలాధ్యక్షుడు విజయ్‌నాయక్ కోరారు. శ్యామాప్రసాద్ జయంతి సందర్భంగా మండల బీజేపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించడంతో పాటు మండల కేంద్రంలో మొక్కలు నాటారు. బీజేపీ నాయకులు తాండ్ర రవీందర్, జి.జంగయ్యగౌడ్, జి.రమేష్‌జి, నడికూడి కృష్ణ, శ్రీకాంత్ రెడ్డి, రమేష్, శ్రీనివాస్‌గుప్త, నాగరాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


యాచారం : మొక్కలు నాటుతున్న నాయకులు

కొనసాగుతున్న కంటి వైద్య శిబిరం

ఆమనగల్లు, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీకేఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటుచేసిన ఉచిత మెగా వైద్యశిబిరం కొనసాగుతోంది. ఆదివారం శిబిరాన్ని ప్రముఖ గైనకాలజిస్టు, మానవతా ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రమ్య సందర్శించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. చెన్నై శంకరన్ నేత్రాలయ సహకారంతో ఏర్పాటు చేసిన శిబిరంలో 500 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 200 మందికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. 35 మందికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించి ఐవోఎల్ ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ఈనెల 13వ తేదీ వరకు శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు రాఘవేందర్ రెడ్డి పేర్కొన్నారు. శిబిరాన్ని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంధత్వ నివారణ కార్యక్రమాన్ని ఒక ఉద్యమ స్ఫూర్తితో ముందుకు తీసుకుపోవాలని డాక్టర్ రమ్య తెలిపారు. శిబిరంలో ఫౌండేషన్ సభ్యులు రచ్చ శ్రీరాములు, నరేందర్‌గౌడ్, జైపాల్‌రెడ్డి, ప్రవీణ్, సందీప్, యూసుఫ్, రఘునాయక్, గణేశ్,శ్రీపతి, శేఖర్, రాఘవేందర్, శివ, తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం


చేవెళ్ల : జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వెంకట్‌రెడ్డి తదితరులు

ఆమనగల్లు/మొయినాబాద్ రూరల్/శంషాబాద్ రూరల్/షాబాద్/చేవెళ్ల/, జూలై 6(ఆంధ్రజ్యోతి): దళిత హక్కుల సాధన, బడుగు జీవుల ఉద్ధరణ, కులరహిత సమాజ స్థాపన కోసం అవిరళ కృషి చేసిన సంఘసంస్కర్త డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ చిరస్మరణీయుడని ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి నర్సింహ అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ విఠాయిపల్లిలో ఆదివారం భారత మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నాయకులతో కలిసి నివాళులర్పించారు. ఎస్సీఆర్‌పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి నిరంజన్, మల్లేశ్, యాదయ్య, రామలింగం, దశరథం, మీసాల తదితరులు పాల్గొన్నారు. జగ్జీవన్‌రాం వర్ధంతిని పురస్కరించుకొని మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ చౌరస్తాలోని ఆయన విగ్రహానికి వివిధ పార్టీల నాయకులు నివాళి అర్పించారు. బీజేపీ మొయినాబాద్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ మహనీయుల ఆశయాల కోసం పనిచేయాలని సూచించారు. అలాగే వివిధ పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో జగ్జీవన్ విగ్రహానికి ఘన నివాళి అర్పించారు. శంషాబాద్ మండలం ముచ్చింతల్‌లో జగ్జీవన్‌రామ్ వర్ధంతిని నిర్వహించారు. అంబేడ్కర్ సేవా సమితి, సంఘం అధ్యక్షుడు జొన్నడ యాదగిరి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. వైస్ ప్రెసిడెంట్ కత్తుల విశాల్, రాఘవేందర్, మాజీ సర్పంచ్ పెంటయ్య, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు కృషి చేయాలని టీజేఎస్ చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి నాగని రామకృష్ణ అన్నారు. నాగర్‌గూడలో జగ్జీవన్‌రాం వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఎంఆర్‌పీఎస్ మండల ఇన్‌చార్జి మల్లేష్, నాయకులు బాల్‌రాజ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్ అని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. చేవెళ్లలో బీజేపీ, కాంగ్రెస్ ఇతర పార్టీలు, సంఘాల నాయకులు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే రత్నం, ప్రకాష్, అనంతరెడ్డి, వైభవ్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, శ్రీనివాస్‌గుప్తా, చేవెళ్ల సొసైటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, యాదయ్య, రాములు, పాండు, సత్యనారాయణరెడ్డి, మాణిక్యం, దుర్గాప్రసాద్, నర్సింహులు, వెంకటయ్య తదితరులున్నారు.


మొయినాబాద్ రూరల్ : హిమాయత్ నగర్ చౌరస్తాలో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు


కడ్తాల : నివాళులర్పిస్తున్న నర్సింహ తదితరులు


శంషాబాద్ రూరల్ : ముచ్చింతల్‌లో నివాళి అర్పిస్తున్న అంబేడ్కర్ సంఘం నాయకులు


షాబాద్ : నాగర్‌గూడలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు